TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ADAAB CYBERABAD

| ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 32 | శనివారం, 15 ఆగస్టు, 2026 | పేజీలు - 4 | వెల: 5/- |
|---|---|---|---|---|---|
| EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 32 | 15-08-2026 (SATURDAY) | PAGES: 4 | RS : 5/- |


## నేను కూడా సైబర్ నేరాల బాధితుడినే

### తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం



హైదరాబాద్,: తాను కూడా సైబర్ నేరాల బాధితుడినేనని హీరో అక్కినేని నాగార్జున అన్నారు. ఈ సందర్భంగా తన లైఫ్?లో జరిగిన సంఘటన గురించి వివరించారు. ఐదేళ్ల క్రితం బ్యాంక్? అధికారిని అంటూ ఓ వ్యక్తి ఫోన్ చేసి, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో తనను మోసం చేసేందుకు ప్రయత్నించాడని నాగార్జున వివరించారు. తన కుటుంబంలో కొందరిని మాయ మాటలతో 6-7 గంటల పాటు డిజిటల్ అరెస్టు చేశాడని వివరించారు. విదేశాలకు నార్కోటిక్ సబ్‌స్టాన్స్ పార్సిల్ పంపారంటూ సైబర్ నేరగాళ్లు కాల్స్ చేశారంటూ ఆయన గుర్తుచేశారు. 15 రోజులకు ఓసారి పాస్‌వర్డ్ మారుస్తా : సైబర్ క్రైమ్ అరికట్టడంలో తెలంగాణ సైబర్ పోలీసులు దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నారని నాగార్జున కొనియాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండటం, వాటిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాగార్జున పిలుపునిచ్చారు. 1977లో నేను ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడే కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయి. మాల్?వేర్, హ్యాకింగ్?పై ప్రొఫెసర్లు హెచ్చరించేవారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సైబర్ క్రైమ్ సమస్య కొనసాగుతూనే ఉంది. నేను కూడా సైబర్ ఫ్రాడ్?కు బాధితుడిగా ఉన్నాను. ఐదేళ్ల క్రితం బ్యాంకు అధికారినంటూ ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఇన్వెస్ట్?మెంట్ పేరుతో మోసం చేసేందుకు ప్రయత్నించాడు. మా కుటుంబంలో కొందరిని మాయమాటలు చెప్పి 6-7 గంటలపాటు డిజిటల్ అరెస్టు చేశారు. వారానికి ఓసారి మొబైల్ పాస్వర్డ్?, నెలకు ఓసారి వైఫై పాస్?వర్డ్ మారుస్తుంటా. వారానికి ఒకసారి మొబైల్ పాస్‌వర్డ్, నెలకు ఒకసారి వైఫై పాస్‌వర్డ్ మారుస్తామని వివరించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ పోలిస్ కమాండ్ కంట్రోల్ లో సురక్ష కా తిరంగా సైబర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ మోసాల పట్ల తాను ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటానన్నారు. పాస్‌వర్డ్‌ను తరచూ మారుస్తుంటానని, ఫోన్‌లో ఫొటోలు తీసుకోనని తెలిపారు. ప్రజల్లో సైబర్ నేరాల అవగాహన కల్పించడం, నేరాల నియంత్రణలో తెలంగాణ పోలీసుల విశేష కృషి చేస్తున్నారని నాగ్ అభినందనలు తెలిపారు. పైరసీ నియంత్రణలో తెలంగాణ పోలీసులు నంబర్?వన్?గా నిలిచారని నాగార్జున ప్రశంసించారు. తెలంగాణ పోలీసుల చర్యల వల్లే తెలుగు పరిశ్రమతో పాటు మొత్తం భారతీయ సినీ పరిశ్రమకు మేలు జరిగిందన్నారు.

## ఇక 'స్మార్ట్'గా రేషన్



హైదరాబాద్ :ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మా రు తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే లబ్ధిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స్ కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరికొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మండలాల్లో ఇప్పటికే ముద్రణ పూర్తి చేసు కున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో దారిద్ర్య రేఖకు దిగువ ఉన్నవారికి తెలుపు రంగు కార్డులు, గులాబీ రంగు కార్డులు ఉండేవి.

## ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం ప్రారంభం.

### 100% సబ్సిడీతో ఉచితంగా పంపిణీ!




హైదరాబాద్ :రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని, సొంత కాళ్లపై నిలబడేలా చేయడమే లక్ష్యంగా తెలం గాణ ప్రభుత్వం ఒక గొప్ప పథకానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీతో (పూర్తిగా ఉచితంగా) ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందజేయనున్నారు. సచివాల యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ స్కీమ్‌ను ప్రారంభించి, దరఖాస్తు ప్రక్రియ, మార్గదర్శకాలను వెల్లడించారు. నియోజకవర్గా నికి వెయ్యి మిషన్లు -- 1.19 లక్షల మందికి లబ్ధి!ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ప్రతి నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు..మొత్తం మిషన్ల సంఖ్య: రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో, ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు. మిషన్ విలువ: ఒక్కో ఆటోమేటిక్ కుట్టు మిషన్ విలువ దాదాపు రూ. 12,000 వరకు ఉంటుంది. లబ్ధిదారులపై నయాపైసా భారం పడకుండా ప్రభుత్వం పూర్తిగా ఉచితంగానే అందిస్తుంది. మహిళలకు ఈ కుట్టు మిషన్ల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

## అగ్నిమాపక శాఖలోకి రూ.40 కోట్లతో అధునాతన వాహనాలు


### - ప్రారంభించిన సీఎం చంద్రబాబు



అమరావతి:రాష్ట్ర అగ్నిమాపకశాఖలోకి మరికొన్ని ఆధునిక వాహనాలు రానున్నాయి. తాజాగా రూ.40 కోట్లతో 58 ఆధునిక ఫైర్ ఫైటింగ్ వాహనాల ను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రా రంభించారు. 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలు, 20 వాటర్ బౌజర్లు, 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను లాంచ్ చేశారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలను అగ్నిమాపక శాఖ సమకూర్చుకుంది. భారీ అగ్నిప్రమాదాల్లో మంటలను అదుపు చేయడానికి అవసరమయ్యే నిరంతర నీటి సరఫరాకు 20 వాటర్ బౌజర్లు కొనుగోలు చేసింది. ఇరుకైన, రద్దీ ప్రాంతాల్లో వేగంగా చేరుకునేలా 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలు పని చేస్తాయి. తొలి దశలో ఇప్పటికే రూ.33 కోట్లతో 65 ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వాహనాల ప్రత్యేకతలను అధికారులు సీఎంకు వివరించారు. కార్యక్రమలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు. తొలి దశలో 65 ఫైర్?ఫైటింగ్ వాహనాలు: అగ్నిమాపక శాఖకు సేవలందించేందుకు అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన శక్తిమంతమైన వాహనాలను ప్రభుత్వం తీసుకువస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్?లో ఇప్పటికే తొలిదశలో రూ.33.25 కోట్లతో 65 ఫైర్? ఫైటింగ్ వాహనాలను సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. తాజా కొనుగోళ్లతో అగ్నిమాపకశాఖ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది. ఈ ఆధునిక వాహనాల ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా, ఎలాంటి పరిస్థితుల్లోనైనా తగ్గించేందుకు వీలు కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం

- హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో జ్యోతిబా పులే, సావిత్రీబాయి పులే దంపతుల విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- విద్యావ్యవస్థను సమూల ప్రక్షాళన చేశామన్న సీఎం



హైదరాబాద్ :తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులు, రహదారులకు శాఖా పరమైన అనుమతులు పర్యావరణ అనుమతులు ఇతర అంశా లపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రు లను కలుస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. ముంపు ఎక్కువగా ఉండదు : 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి గతంలోనే మహారాష్ట్ర అంగీకరించిన సీఎం కేంద్రమంత్రికి విషయాన్ని గుర్తుచేశారు. 150 మీటర్ల ఎత్తుతో డ్యాం నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని ఒకవేళ 150 మీటర్లకు ఎత్తు పెంచినా ముంపు ప్రాంతం కేవలం 1000 హెక్టార్ల లోపే ఉంటుందని సీఆర్ పాటిల్‌కు సీఎం వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా ప్రాణహిత నది నీటిని గ్రావిటీతో సాగు, తాగుకు అందించే అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ అనుమతులు ఇవ్వండి : అంతకు ముందు గౌరవెల్లి, సీతారామ ఎత్తిపో తలు, డిండి, పాలమూరు-రంగారెడ్డి తదితర ప్రా జెక్టులకు పర్యావరణ అనుమతులపై కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపే oదర్ యాదవ్‌ను కలిసి చర్చించారు. త్వరగా అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. ఈ చర్చల్లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు, సెక్రటరీ శ్రీధర్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏఐసీసీ అగ్రనేతల వద్దకు : అనంతరం సీఎం రేవంత్ ఏఐసీసీ అగ్రనేతలను కలిసే అవకాశాలున్నట్లు తెలిసింది. నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పులే విధానాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అన్నివర్గాలు ఒకేచోట చదువు, జీవించడం వల్ల కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. చదువుతో తలరాత మారి సమాజంలో గుర్తింపు లభిస్తుందని వివరించారు.

## ఎర్రకోట వేదికగా సరికొత్త చరిత్ర.. 150 ఏళ్ల 'వందేమాతరం' వేడుకలు.




న్యూ ఢిల్లీ : భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ దేశ రక్షణలో, ప్రజాసేవలో అసమాన ధైర్యసాహసాలు కనబరిచిన 1,057 మంది భద్రతా సిబ్బందికి శౌర్య మరియు విశిష్ట సేవా పతకాలను అధికారికంగా ప్రకటించింది. పోలీస్, అగ్నిమాపక, హోంగార్డ్స్, సివిల్ డిఫెన్స్ మరియు జైళ్ల శాఖసిబ్బంది ఈ గౌరవప్రదమైన పురస్కారాలకు ఎంపికయ్యారు. శౌర్య పతకాలు ఉ సేవా పురస్కారాల వివరాలుపాణాలను సైతం లెక్కచేయకుండా కర్తవ్య నిర్వహణలో అసాధారణ తెగువ చూపిన వీర జవాన్లకు కేంద్రం పట్టం కట్టింది..గ్యాలెంట్రీ పతకాలు (301 మంది):



శనివారం, ఆగస్టు 15, 2026 | TGTEL/26/A4985 ఆదాబ్ సైబరాబాద్ ADAAB CYBERABAD | 2

# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ జంగయ్య యాదవ్

**ఆదాబ్ సైబరాబాద్,మేడ్చల్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కిష్టాపూర్--పూడూర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి భవాని రాఘవేందర్ గౌడ్ నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ జంగయ్య యాదవ్ హాజరై, కాంగ్రెస్ నాయకులతో కలిసి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 297వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298వ డివిజన్ అధ్యక్షుడు



రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, 299వ డివిజన్ అధ్యక్షుడు గర్యాల సురేందర్ ముదిరాజ్, జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు కురుమ, మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ, జాకట దేవరాజ్, కౌడె మహేష్ కురుమ, పెంజర్ల స్వామి యాదవ్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, నారెడ్డి రవీందర్ రెడ్డి, సాటె నరేందర్ వంజరి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోమారం బాల్ రెడ్డి, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, కాలేరు శ్రీకాంత్ వంజరి, చెర్వుకొమ్ము శేఖర్ గౌడ్, బొక్కరఘుపతి రెడ్డి, చంద్రయ్య గౌడ్, పోచయ్య, వరధా రెడ్డి, చీర్ల ఆకాష్ కురుమ, ఆటో విజయ్, నర్సింగ్ రావుతో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభోత్సవ ఆహ్వానం



**ఆదాబ్ సైబరాబాద్, శేరిలింగంపల్లి :** ఆల్విన్ కాలనీ ఉమ్మడి 124వ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో ఏర్పాటు చేసిన సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌లను క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్ సుకన్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం నిర్వహించనున్న క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీని ఆహ్వానించినట్లు తెలిపారు. సుమని క్లినిక్‌లో జనరల్ ఫిజిషియన్, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలతో పాటు సంబంధిత వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని చెప్పారు.

క్లినిక్ ప్రారంభం సందర్భంగా తొలి రెండు రోజుల పాటు ఉచిత కన్సల్టేషన్ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సదవకాశాన్ని ఆల్విన్ కాలనీ, ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు

# జర్నలిస్టులకు ఇళ్ల కేటాయింపు నిష్పక్షపాతంగా జరగాలి

**- సీనియారిటీ ఆధారంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంఆర్‌ఓకు వినతి**

**ఆదాబ్ సైబరాబాద్, కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి మండల పరిధిలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టులు మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్‌ఓ) అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కేటాయింపులో అర్హత, సీనియారిటీ, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం పారదర్శకంగా కేటాయింపులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సోమవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం



సమర్పించనున్నట్లు జర్నలిస్టులు తెలిపారు.

**- సీనియారిటీ ఆధారంగా పరిశీలిస్తాం: ఎంఆర్‌ఓ**

జర్నలిస్టుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఆర్‌ఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. అర్హత, సీనియారిటీ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

**- సీనియర్ జర్నలిస్టులు పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కట్టెల మల్లేష్, సి.హెచ్. రామారావు, మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాదె వెంకట్, ఎం.ఎస్. ఆనంద్‌రావు, అంబటి వెంకట్, జంగాల నాగార్జున, బి. శంకర్ పాల్గొన్నారు.

ఫొటో క్యాప్షన్: కూకట్‌పల్లి ఎంఆర్‌ఓ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ జర్నలిస్టులు.

# గాజులరామారం సర్కిల్‌లో రహదారి ఆక్రమణల తొలగింపు




**హైదరాబాద్:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ పరిధిలో రహదారి ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఉషా ముళ్లపూడి హాస్పిటల్ నుంచి చంద్రగిరి నగర్ చౌరస్తా వరకు రహదారిపై ఉన్న ఆక్రమణలను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా రహదారులను ఆక్రమించిన నిర్మాణాలు, ఇతర ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా గాజులరామారం ఉప కమిషనర్ యు. వెంకట రాములు మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలో ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారులను ఆక్రమించి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు . ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. రహదారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు మరోసారి హెచ్చరించారు.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయాలి

**- శాస్త్రీయ పద్ధతిలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి**

**- మాజీ మేయర్ శాంతి కొటేష్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్**




**ఆదాబ్ సైబరాబాద్, జవహర్ నగర్ :** ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతిలో శాశ్వతంగా మూసివేయాలని మాజీ మేయర్ దొంతగాని శాంతి కొటేష్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ప్రగతినగర్‌లో డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన మాజీ ప్రజాప్రతినిధుల సమావేశం జరిగింది. ప్రభావిత ప్రాంతాల్లో ఉచిత మంచినీరు, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు భూమి, నీటి శుద్ధికి రాంకీ సంస్థ నుంచే నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. బోనాల జాతర అనంతరం డివిజన్ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి డంపింగ్ యార్డు తరలింపునకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో మేక లలిత యాదవ్, గౌడుగు వేణు, ఏ.సుబ్రహ్మణ్యం, ఎం.రాజ్‌కుమార్, జమాల్‌పూర్ నవీన్, ఎం.వెంకటేష్, జి.సాయికుమార్, పల్లపు రవి తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారుల అవస్థలు

## చెక్‌పోస్ట్ కిష్టాపూర్ లింక్ రోడ్డుపై గుంతలు



**ఆదాబ్ సైబరాబాద్,మేడ్చల్:** సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని 298 మేడ్చల్ డివిజన్ చెక్‌పోస్ట్--కిష్టాపూర్ లింక్ రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోడ్లపై ఏర్పడుతున్న గుంతలకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ కో ఆప్షన్ మెంబర్ నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆర్‌అండ్‌బీ అధికారులు మట్టితో నింపి చేతులు దులుపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.కోటి నిధులు వెచ్చించి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు.

అధికారులు మొద్దు నిద్ర వీడి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్, మండల ఈశ్వరయ్య, విఠల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ బస్‌స్టాప్ సమస్యలపై ఎమ్మెల్యే పరిశీలన

**ఆదాబ్ సైబరాబాద్, కుషాయిగూడ :** కుషాయిగూడ బస్‌స్టాప్ పరిరక్షణతో పాటు ట్రాఫిక్ సమస్యలు, రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు, స్థానిక వ్యాపారులు ఎదుర్కొంటున్న చలాన్ల సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందించారు. కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం బస్‌స్టాప్ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు బస్‌స్టాప్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యం, బారికేడ్ల కారణంగా వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చలాన్ల పేరుతో స్థానిక వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సంబంధిత కమిషనర్, అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బస్‌స్టాప్ సక్రమంగా కొనసాగడంతో పాటు ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం



చూపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, వ్యాపారులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# భూ బాధితులకు బీఆర్ఎస్ అండ



**ఆదాబ్ సైబరాబాద్, శామీర్‌పేట:** బొమ్మరాశిపేట గ్రామ భూ బాధితులకు మద్దతుగా శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. భూ బాధితుల సమస్యలను వారు అడిగి తెలుసుకుని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి భూ సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, భూ బాధితుల హక్కుల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు, భూ బాధితులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 22 సెక్షన్ సమస్య పరిష్కారం కోసం పోరాడతా

**- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు కార్యాలయంలో కెపిహెచ్బి డివిజన్‌కు చెందిన కాలనీ, అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సభ్యులతో చర్చించారు.

ప్రధానంగా సర్దార్ పటేల్ నగర్, భగత్‌సింగ్ నగర్, వసంత్ నగర్, సీబీసీఐడి కాలనీ తదితర ప్రాంతాలను 22ఏ సెక్షన్‌లో చేర్చడం వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్, నిర్మాణ అనుమతుల సమస్యలను అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై గురువారం కేపీహెచ్బిలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. సమస్యపై వారు సానుకూలంగా స్పందించారని, అతి త్వరలోనే పరిష్కారం లభించే అవకాశం ఉందని చెప్పారు.

22 సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అవసరమైతే సమస్య పరిష్కారం కోసం నిరసన దీక్ష చేపడతానని అసోసియేషన్ సభ్యులకు స్పష్టం చేశారు.

ఇదే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వంతో పోరాడి ఈ సమస్యకు పరిష్కారం తీసుకువస్తామని వారు కూడా హామీ ఇచ్చారని చెప్పారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో కెపిహెచ్బిలో



ఖాళీ స్థలాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కులు, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేశామని మాధవరం కృష్ణారావు అన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 10 గజాల స్థలాన్ని కూడా వేలం వేసి విక్రయిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా ఖాళీ స్థలాలను వినియోగించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సెక్రటరీ రాజేష్ రాయ్, వివిధ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రామ్ దాస్ నగర్‌లో స్వర్ణరాజ్ శివమణి పర్యటన



**ఆదాబ్ సైబరాబాద్, కాప్రా:** రామ్ దాస్ నగర్ కాలనీలో మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పర్యటించారు. కాలనీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను సన్మానించారు. నాలుగు చిన్న వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన స్వర్ణరాజ్ శివమణి, మిగిలిన అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య విద్యార్థుల స్టైపెండ్ పెంపు కోసం ఎమ్మెల్యేకు వినతి



**ఆదాబ్ సైబరాబాద్, ఉప్పల్:** గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ పెంపు డిమాండ్‌పై కొనసాగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా జేఎస్‌పీఎస్ హోమియోపతి పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఇతర వైద్య విభాగాలతో సమానంగా న్యాయమైన స్టైపెండ్ పెంపు కల్పించి, ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గంధం నాగేశ్వర్‌రావు, శివగౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల హక్కుల అమలుపై డైరెక్టర్‌కు వినతి



**ఆదాబ్ సైబరాబాద్ :** తెలంగాణ వికలాంగుల సంక్షేమ శాఖ నూతన డైరెక్టర్‌ను మలక్‌పేట్‌లోని కార్యాలయంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల చట్టం--2016ను అన్ని జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని, వికలాంగులకు ప్రతికూలంగా ఉన్న 2018 నిబంధనలను రద్దు చేసి అనుకూలమైన నూతన నిబంధనలు జారీ చేయాలని కోరారు. అన్ని కమిటీల్లో వికలాంగులకు తగిన ప్రాతినిధ్యం, అధికారాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, మహిళా నాయకురాలు యశోద గోదా, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పేట్ ముదిరాజ్ సంఘం కమిటీ హాల్ నిర్మాణ పనులకు శ్రీకారం

**మంథని, ఆగస్టు 14** బోయిన్‌పేట్ ముదిరాజ్ సంఘం కమిటీ హాల్ నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మొదటి విడతగా రూ.15 లక్షలు, రెండో విడతగా రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి.ఈ సందర్భంగా కమిటీ హాల్ నిర్మాణ పనులకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ జంబోజు సమ్మయ్య, ఏఈ మౌనికతో పాటు బోయిన్‌పేట్ ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.కమిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## చైర్మన్, కమిషనర్ నేతృత్వంలో డ్రై ఫ్రైడే

**- డెంగ్యూ,మలేరియాపై అవగాహన**

**పెబ్బేరు ఆగస్టు 14** పురపాలక పరిపాలన కమీషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 10వ వార్డులో శుక్రవారం డ్రై డే ఫ్రైడే, డెంగ్యూ,మలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం, దగ్గు లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆశా కార్యకర్తలకు తెలియజేయాలని సూచించారు.వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చేసే దోమల లార్వా గుడ్లు పెట్టకుండా ఉంటుందని తెలిపారు. ఇళ్లలో చెత్తను మున్సిపల్ చెత్త ఆటోలోనే వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ గణేష్, కౌన్సిలర్ మన్యం, మెప్మా కోఆర్డినేటర్ రాధ, వార్డు ఆఫీసర్ ధర్మతేజ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ కుమార్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్,ఏఎన్ఎం శారద,ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చెంచువాడ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత దుస్తుల పంపిణీ

**పెబ్బేరు,ఆగస్టు 14** స్థానిక చెంచువాడ లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఏకరూప ఉచిత దుస్తులను మండల విద్యాధికారి జయరాములు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన రంగు, మెరుగైన కుట్టుతో కూడిన యూనిఫాంలను అందిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కూడా కల్పిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జి నరసింహగౌడ్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ పార్వతి శివసాయి,మెప్మా కోఆర్డినేటర్ రాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి,చిన్న రాములు, ఉపాధ్యాయులు స్వాతి,మాధురి,రాధ ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ కృష్ణవేణి,పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బారువలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' వేడుకలు

**బారువ, 14** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఘనంగా జాతీయ పతాకాల ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.డి రామారావు గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్.ఎస్.ఎస్. (బీూ) యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీమతి స్నేహలత పల్లి మరియు యూనిట్-2 ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ తెప్పల రాజేంద్ర ప్రసాద్‌లు ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని, చేతిలో జాతీయ జెండాలతో బారువ వీధుల్లో దేశభక్తి నినాదాలు చేస్తూ ఘనంగా ర్యాలీ నిర్వహించారు.

# పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**- సీఎం సానుకూలత**
**- మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు**



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్:** ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ యోధుడు, ప్రజా నాయకుడు పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించడంతో పాటు, ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. అలాగే ముదిరాజ్ సామాజిక వర్గాన్ని ప్రస్తుతం ఉన్న బీసీ-డీ కేటగిరీ నుంచి బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.ముదిరాజ్ సంఘం నాయకుల విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు, ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఏ కేటగిరీలోకి మార్చే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గం అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఆ వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# మన దేశం మన బాధ్యత

**-స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 150 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ**





**విజయనగరం, ఆగస్టు 14:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం విజయనగరం కోట కూడలి నుంచి 150 అడుగుల పొడవైన జాతీయ జెండాతో నిర్వహించిన భారీ ర్యాలీని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ జెండా ఊపి ప్రారంభించారు. భారీ సంఖ్యలో ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ లి"మన దేశం--మన బాధ్యత"లిగా భావించి ప్రతి ఒక్కరూ ర్యాలీలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రాంతీయ వాసి, మహాకవి గురజాడ అప్పారావు చెప్పిన "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ కృషి చేస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఎన్నో తరాల నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, వారి దిశానిర్దేశంలో "మన దేశం--మన బాధ్యత" నినాదంతో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ భారీ ర్యాలీ ప్రజల్లో స్ఫూర్తి, దేశభక్తి, దేశం పట్ల గౌరవాన్ని మరింత పెంపొందించేలా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ జెండాను చూడగానే ప్రతి భారతీయుడిలో దేశభక్తి ఉప్పొంగుతుందని, పండగ వాతావరణం మనసంతా నిండుతుందని భావోద్వేగంతో పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ భావితరాలకు వారి సేవలను తెలియజేయాలని కోరారు.ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ దేశానికి యువతే వెన్నెముక అని అన్నారు. ప్రతి యువకుడిలో దేశభక్తి, దేశంపై ప్రేమ, అభిమానం వెల్లివిరియాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పిలుపు మేరకు యువత దేశభక్తిని బాధ్యతగా స్వీకరించి భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడం అభినందనీయమన్నారు.జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – "హర్ ఘర్ తిరంగా" ర్యాలి కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడానికే పరిమితం కాకుండా, ప్రతి పౌరుడిలో దేశభక్తి భావనను మరింత బలపరిచే గొప్ప కార్యక్రమమని తెలిపారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు, స్వాతంత్ర్యానికి ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని ఘనంగా చాటాలని ప్రజలను కోరారు.ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, యువత జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో సుధా సాగర్ మున్సిపల్ కమిషనర్ బాలస్వామి డిఆర్డీఏ పిడి శ్రీనివాస్ పాణి, డి ఎస్ డి ఓ వెంకటేశ్వరరావు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కోట్పల్లి ప్రాజెక్టులో ఘనంగా జరిగిన తిరంగా బోట్ ర్యాలీ

**-దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిన త్రివర్ణ పతాకాల ర్యాలీ**
**-ముఖ్య అతిథిగా పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా:** కోట్పల్లి ప్రాజెక్టులో దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ తిరంగా బోట్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బోట్లపై జాతీయ జెండాలను అలంకరించి, త్రివర్ణ పతాకాలతో బోటింగ్ సిబ్బందితో కలిసి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బోటింగ్ కోఆర్డినేటర్ రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బోటింగ్ సిబ్బంది జాతీయ జెండా గౌరవం, దేశభక్తి, జాతీయ సమైక్యత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కోట్పల్లి ప్రాజెక్టు అందాల మధ్య త్రివర్ణ పతాకాలతో సాగిన బోట్ ర్యాలీ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. "దేశం కోసం – – దేశ ఐక్యత కోసం" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోటింగ్ కోఆర్డినేటర్ రాములు, బోటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.





# నేర నియంత్రణపై ఎస్పీ స్నేహ మెహ్రా ఫోకస్..!

- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి : జిల్లా ఎస్పీ
- సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా..
- మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత

**ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్ జిల్లా :** జిల్లాలో నేర నియంత్రణను మరింత పటిష్టం చేసి, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో శాంతిభద్రతలు, నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలపై ఆమె సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా పలు కేసుల ఫైళ్లను స్వయంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో ఇప్పటివరకు సేకరించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ అంశాలు, చార్జ్‌షీట్ దాఖలు పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తులో ఎలాంటి లోపాలు, జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

"నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించడమే మన ప్రధాన లక్ష్యం. ప్రతి కేసును బాధ్యతగా తీసుకుని నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి. పెండింగ్ కేసుల




దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్తులకు చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా సమర్థవంతంగా పనిచేయాలి" అని ఎస్పీ స్నేహ మెహ్రా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సైబర్ నేరాలు, డ్రగ్స్ పై నిఘా**

సైబర్ నేరాల నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణ, కేసుల వివరాల నమోదు, సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష్య వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

**నీతి, నిజాయితీతో విధులు నిర్వహించాలి**

"పోలీసు విధుల్లో నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవా దృక్పథం అత్యంత ముఖ్యమైనవి. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రతి పోలీస్ అధికారి అంకితభావంతో పనిచేయాలి. మంచి పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం" అని ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు.

**ఉత్తమ పనితీరుకు ప్రశంసలు**

అనంతరం జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచి గుడ్ వర్క్ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేసి, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.
ఈ సమీక్షా సమావేశంలో జిల్లా డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

శనివారం, ఆగస్టు 15, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# దేశ విభజన బాధితులకు ప్రధాని మోదీ నివాళి



**న్యూ ఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ విభజన సమ యంలో తీవ్ర విషాదాన్ని, కష్టాలను ఎదుర్కొన్న బాధితులను స్మరించుకున్నారు. దేశ విభజన భయాందోళనల సంస్మరణ దినం (పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే) సందర్భంగా వారికి నివాళులర్పించిన ప్రధాని, విభజన వల్ల ప్రభావి తమైన ప్రజల ధైర్యాన్ని, స్థైర్యాన్ని కొనియా డారు. ఆ విషాద ఘటనలు మిగిల్చిన గాయా లను గుర్తుంచుకోవడంతో పాటు, దేశంలో ఐక్యత, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గతం నుంచి పాఠాలు నేర్చుకు ని, ప్రజల మధ్య ఐక్యతను కాపాడుకోవడం ద్వారా బలమైన, సమైక్య భారతదేశాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేసిన ప్రధాని మోదీ, దేశ విభజన చరిత్రలో ఎన్నో జీవితాలను ఛిన్నాభిన్నం చేసిందని పేర్కొన్నారు. లక్షలాది కుటుంబాలు తమ ఇళ్లు, ఆస్తులు, స్వస్థలాలను వదిలి వెళ్లాల్సి వచ్చిందని, ఎంతో మంది తమ ఆత్మీయులను కోల్పోయారని గుర్తుచేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న ప్రజల ధైర్యం, స్థైర్యం దేశానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. మనం విభజన భయానక స్మృతి దినోత్సవాన్ని పాటిస్తున్నాం. దేశ విభజన వల్ల ప్రభావితమైన వారందరి ధైర్యాన్ని మనం స్మరించుకుంటున్నాం. అది చరిత్రలో ఎన్నో జీవితాలను ఛిన్నాభిన్నం చేసిన ఘట్టం. కుటుం బాలు చెల్లాచెదురయ్యాయి, ఆత్మీయులను కోల్పోయారు, అపారమైన బాధను అనుభవిం చారు. అదే సమయంలో, దీనిని అధిగమించి, ప్రజలు ఏమీ లేని స్థితి నుంచి తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతను విజయ ంగా మార్చుకున్నారు, మన దేశ ప్రగతికి అపార ంగా దోహదపడ్డారు. వారి జీవిత ప్రయాణాలు మానవ స్ఫూర్తి బలాన్ని మనకు గుర్తుచేస్తాయి."– ప్రధానమంత్రి నరేంద్ర మోదీసామ రస్యం, సౌభ్రాతృత్వం కోసం సంకల్పందేశ విభజన వంటి విషాదకర ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రజల మధ్య ఐక్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. వివిధ మతాలు, సంస్కృతులు, భాషలకు చెందిన ప్రజలు పరస్పర గౌరవంతో జీవించడం ద్వారానే బలమైన భారతదేశం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారుకేంద్ర మంత్రుల నివాళులుఇదిలా ఉండగా విభజన భయానక స్మరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా బాధితులకు నివాళులర్పించారు. దేశ విభజన భారత చరిత్రలో అత్యంత విషాదకర అధ్యాయాల్లో ఒకటని పేర్కొన్నారు. లక్షలాది కుటుంబాలు ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను దేశం ఎప్పటికీ మరవదని అన్నారు. విభజన వల్ల కలిగిన వేదనను గుర్తుంచుకోవడం మాత్రమే కాకుండా, దేశ ఐక్యతను కాపాడుకోవడం కూడా ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. విభిన్నతలో ఏకత్వమే భారతదేశ బలమని, అదే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 14న ఎందుకు పాటిస్తారు? 1947లో భారతదేశ విభజన సందర్భంగా ప్రాణాలు కోల్పోయినవారిని, నిరాశ్రయులైన కోట్లాది మందిని స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 14ను 'విభజన భయానక స్మరణ దినోత్సవం'గా ప్రకటించింది. స్వాతంత్ర్యానికి ముందు జరిగిన విభజన కారణంగా చోటుచేసుకున్న ఈ పరిణామం మానవ చరిత్రలోనే అతిపెద్ద వలసల్లో ఒకటిగా చెబుతుంటారు. దాదాపు రెండు కోట్ల మంది ప్రజలు తమ నివాస ప్రాంతాలను విడిచి వెళ్లాల్సి వచ్చిందని అంచనా. లక్షలాది కుటుంబాలు శరణార్థులుగా మారాయి. సామాజిక, మతపరమైన హింసలో లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదం ప్రభావం అనేక కుటుంబాలపై తరతరాల పాటు కొనసాగింది.

# ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా



**ఢిల్లీ :** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. గురువారం ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్చారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. జేపీ నడ్డా వయసు 65. ఈ నేపథ్యంలో ఆయనకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు అనేక రకాల పరీక్షలు నిర్వహించారు. వాటిలో కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష కూడా ఉంది.ప్రస్తుతం జేపీ నడ్డా ఆరోగ్యం నిలకడగా ఉందని, కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రివర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. గురువారం సాయంత్రం ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వెల్లడించాయి. అయితే, ఆయనకు గల అనారోగ్య సమస్యకు సంబంధించిన వివరాల్ని మాత్రం వివరించలేదు. సాధారణంగా గుండె రక్త నాళాల్లో ఏదైనా సమస్య, అడ్డంకి ఉందా అని తెలుసుకునేందుకు వైద్యులు కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఏదైనా సమస్య తలెత్తితే అవసరమైన శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. జేపీ నడ్డా గతంలో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా పని చేశారు.ఆ తర్వాత ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా నితిన్ నబిన్ చేపట్టారు. మోదీ క్యాబినెట్‌లో నడ్డా కీలకంగా ఉన్నారు. మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడు. ఇదే సమయంలో పార్టీని జాతీయ స్థాయిలో బలోపేతం చేసిన నేతగానే కాకుండా, వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి తెచ్చిన నాయకుడిగానూ నడ్డాకు

# ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోట సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపు.



**ఢిల్లీ :** దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే.. మరోపక్క దేశ రాజధానికి మాత్రం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట, హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించారు. ఆగష్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగష్టు 15న మధ్యా హ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు.ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు. సిక్కులకు న్యాయం చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైనట్లు, అందులోనూ 1984లో జరిగిన సిక్కు అల్లర్ల కేసులో బాధిత సిక్కులకు కోర్టు న్యాయం చేయలేకపోయిందని, అందుకే ఢిల్లీ హైకోర్టును టార్గెట్ చేశామని మెయిల్‌లో వివరించారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3ని పేల్చేస్తామన్నారు. జామ్‌నగర్ హౌజ్, ఝుండేవాలన్ బిల్డింగ్ వంటివాటికి కూడా బాంబు ముప్పు ఉంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటిం చారు. బాంబు బెదిరింపులు ఉన్న ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గట్టి నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ రూట్లలో తనిఖీలు చేపడుతున్నారు.ఇతర పబ్లిక్ ప్లేసులలో కూడా తనిఖీలు చేప ట్టారు. భద్రతను మరిం తకట్టుదిట్టం చేశారు.

# 1057 మంది భద్రతా సిబ్బందికి శౌర్య, సేవా పతకాలు- కేంద్ర హోంశాఖ ప్రకటన

**న్యూ ఢిల్లీ :** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోంశాఖ 1057 శౌర్య, సేవా పతకాలను ప్రకటించింది. ఇందులో పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్?ఢ సివిల్ డిఫెన్స్?, కరెక్షనల్ సర్వీసెస్?కు చెందిన మొత్తం 1057 మంది సిబ్బంది ఉన్నారు.గ్యాలెంట్రీ అవార్డ్సకేంద్ర హోంశాఖ ఈసారి 301 గ్యాలెంట్రీ అవార్డులను ప్రకటించింది. అందులో 272 మంది పోలీసులు, 29 మంది అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు. ప్రాంతాల వారీగా చూసుకుంటే, నక్సలైట్ (ఎల్‌డబ్ల్యూఈ) ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసిన 197 మందికి, జమ్మూకశ్మీర్?- 51, ఈశాన్య రాష్ట్రాలు-12, ఇతర ప్రాంతాలు- 41 మందికి ఈ గ్యాలెంట్రీ పతకాలు ప్రకటించారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడడంలో, నేరాలను అదుపులో ఉంచడంలో, ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో ప్రాణాలకు తెగించి పోరాడిన సిబ్బందికి 'మెడల్ ఫర్ గ్యాలెంట్రీ' పతకాన్ని అందజేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో గ్యాలెంట్రీ మెడల్ వచ్చింది వీరికే

కొర్లాన మల్లేశ్ - ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ (ఏపీ)
పైడి శ్రీరామమూర్తి - ఏఆర్ హెడ్ కానిస్టేబుల్? (ఏపీ)
ఆదారి హేమసుందరరావు- ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ (ఏపీ)
చింతపల్లి సత్యనారాయణ- ఏఆర్ పోలీస కానిస్టేబుల్ (ఏపీ)రౌతు మహేశ్- ఏఆర్ పోలీస్ కానిస్టేబుల (ఏపీ)



ఆబోతుల అప్పలనాయుడు- ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్? (ఏపీ)రుత్తల కన్నబాబు- ఏఆర్ పోలీస కానిస్టేబుల్? (ఏపీ)
బి. సత్యారావు - జూనియర్ కమాండో (తెలంగాణ)
కె.సందీప్ కుమార్- జూనియర్ కమాండో (తెలంగాణ)
జె.వంశీకృష్ణ- జూనియర్ కమాండో (తెలంగాణ)

సేవా పతకాలవిధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 'రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం' (పీఎస్ఎం), నిరంతర అంకితభావతంతో పనిచేసిన వారికి 'మెరిటోరియస్ సేవా పతకం' (ఎంఎస్ఎం) అందజేస్తారు. ఈసారి కేంద్ర హోంశాఖ 92 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలను ప్రకటించింది. విభాగాల వారీగా చూసుకుంటే పోలీస్ సర్వీస్- 83, అగ్నిమాపక విభాగం- 4, సివిల్ డిఫెన్స్ అండ్? హోంగార్డ్స్?- 3, కరెక్షనల్ సర్వీస్- 02 చొప్పున ప్రకటించారు

విజయ్ కుమార్ గుడి - ఇన్?స్పెక్టర్ జనరల్ (ఏపీ)వెంకటరామి రెడ్డి బాలంకరి, ఇన్?స్పెక్టర్ నర్సయ్య జోగుల, అడిషనల్ డిప్యూటీ ఆఫ్ పోలీస్ ఆర్ జగదీశ్వర్ రెడ్డి, పోలీస్? ఎంఎస్?ఎం పతకాలుఈ ఏడాది 664 మందికి మెరిటోసియస్ సేవా పతకాలను ప్రకటించారు. పోలీస్? సర్వీస్?-606, అగ్నిమాపక సిబ్బంది-28, సివిల్ డిఫెన్స్? అండ్ హోంగార్డ్స్- 18, కరెక్షనల్ సర్వీస్- 12 మెడల్స్ చొప్పున ప్రకటించారు.గీతాదేవి వెలగా - పోలీస్? సూపరింటెండెంట (ఏపీ)సుబ్బారావు తుమ్మల- డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగ్గు నాయుడు పెంట- డిప్యూటీ సూపరింటెండెంట్? ఆఫ్ రామకృష్ణ ఐ- అసిస్టెంట్? సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏపీ)

# సెప్టెంబర్‌లో జనగణన షురూ 40 ప్రశ్నలను నోటిపై చేసిన కేంద్రం



**న్యూ ఢిల్లీ** సెప్టెంబర్ 1 నుంచి మంచు తీవ్రంగా కురిసే ప్రాంతాల్లో జనగణన ప్రారంభం కానుంది. అక్కడ జనగణన ప్రక్రియలో భాగంగా సిబ్బంది ప్రజలను అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం, షెడ్యూల్డ్ కులం (ఎస్సీ) లేదా షెడ్యూల్డ్ తెగ చెందినవారా? కాదా? వంటి ప్రశ్నలను జనగణన సందర్భంగా సిబ్బ ంది ప్రజలను అడగనున్నారు. ఈ మేరకు రిజి స్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కు మార్ నారాయణ్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు."జనాభా గణన చట్టం-1948లోని సెక్షన్ 8, ఉప విభాగం (1) ద్వారా సంక్రమిం చిన అధికారాలను వినియోగించుకుం టూ కేంద్ర ప్రభుత్వం ఈ కింది ఆదేశాలను జారీ చేసింది. నియమించిన అధికారులు తమ పరిధిలోని ప్రాంతాల్లో నివసించే వ్యక్తులను హౌస్‌హోల్డ్ షెడ్యూల్ (కుటుంబ వివరాల పత్రం) ద్వారా సమాచారాన్ని సేకరించేందుకు, నిర్దేశించిన అంశాలకు సంబంధించి ప్రశ్నలు అడగవచ్చు." అని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఉత్తర్వులో వెల్లడించారు.ఏయే ప్రశ్నలటే?జనగణన సమయ ంలో ప్రజలను వారి వైవాహిక స్థితి, వివాహ సమయంలో వయసు, జీవిత భాగస్వామి పేరు, జాతీయత, మతం, షెడ్యూల్డ్ కులం (ఎస్సీ)/షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ), కులం, తల్లిదండ్రుల వివరాలు, వైకల్యం, మాతృభాష, తెలిసిన ఇతర భాషలు, అక్షరాస్యత, డిజిటల్ లిటరసీ వంటి వ్యక్తిగత వివరాల గురించి సిబ్బంది అడుగుతారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విద్యాసంస్థలో హాజరు, అత్యున్నత విద్యా స్థాయి, చదువుకున్న విభాగం లేదా సబ్జెక్టు, గత ఏడాది కాలంలో జాబ్ చేశారా, ఆర్థిక స్థితి, వృత్తి వంటి వివరాలను కోరుతారని వెల్లడి ంచాయి. అలాగే వలసదారు లకు పలు ప్రశ్నలను అడుగుతా రని చెప్పాయి. పుట్టిన ప్రదేశం, అంతకుముందు నివసించిన ప్రదేశం, వలసకు గల కారణం, చివరి వలస తర్వాత ఈ గ్రామం/పట్టణంలో ఎప్పటి నుంచి నివసిస్తున్నారు, శాశ్వత నివాస చిరునామా వంటి వివరాలను సిబ్బంది కోరుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొవిడ్-19 టీకా వేయించుకున్న ప్రదేశం, మొత్తం బ్యాంక్ ఖాతాల సంఖ్య, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఓటర్ ఐడీ నంబర్, పాస్‌పోర్ట్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? లేదా? అనే వివరాలను కూడా అడుగుతాయని చెప్పాయి. అయితే సిబ్బంది ప్రజలను అడిగే ప్రశ్నావళిలో కులాల జాబితా ఉండే అవకాశం లేదని వెల్లడించాయి. ప్రజలు స్వయంగా చెప్పిన వివరాలనే సిబ్బంది నమోదు చేస్తారని పేర్కొన్నాయి.సెప్టెంబరు 1న అక్కడ స్టార్టద్ధాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కూడిన (సాధారణ సమయాల్లో గణన జరగని) ప్రాంతాల్లో జనగణన సెప్టెంబర్ 1-30 వరకు జరగనుం దని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఆగస్టు ప్రారంభంలో ఓ ఉత్తర్వును జారీ చేశారు. ఈ జనగణన నిర్వహణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలు సేకరించే ప్రక్రియ (ప్రారంభానికి ముందు ఆగస్టు 17-31 వరకు ఎన్యూరేషన్) సదుపాయం కూడా ఉంటుందని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.అయితే దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది. కాగా, జనగణనలో భాగంగా కుల వివరాలను సేకరించడం ఇదే మొదటిసారి కానుంది. కుల గణనను చేపట్టాలనే నిర్ణయాన్ని గతేడాది ఏప్రిల్ 30న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ ఆన్ పొలిటికల్ అఫైర్స్

# విజయ్ ప్రభుత్వానికి ఊరట- మద్రాస్ హైకోర్టు ఆర్డర్స్‌పై స్టే విధించిన సుప్రీంకోర్టు



**న్యూ ఢిల్లీ :** సుప్రీంకోర్టులో విజయ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. గతేడాది కరూర్?లో జరిగిన తొక్కి సలాటలో మరణించినవారి బంధువులకు ప్రభు త్వ ఉద్యోగాలు కల్పిస్తూ టీవీకే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్? హైకోర్టు కొట్టేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది.జస్టిస్ జేబీ పార్ధి వాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లో ద్విసభ్య ధర్మాసనం ఈ విషయంపై తమిళనాడు ప్రధాన కార్యదర్శితో పాటు ఇతరులకు నోటీసులు జారీ చేసి ంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన పిటిషనర్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. "కరూర్‌లో తొక్కిసలాట జరిగింది. ప్రజలు చాలా మంది చనిపోయారు. ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక పరిహారం, ఉద్యోగం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించడానికి మీరు ఎవరు ఒకవేళ ఆ దారుణ ఘటనలో కుటుంబంలో సంపాదించే ఏకైక వ్యక్తి మరణిస్తే, ప్రభుత్వం వారి కుమారుడికో, లేదా కుమార్తెకో ఉద్యోగం ఇవ్వకూడదా ఆ కుటుంబానికి ఆర్థిక ఆసరా ఇవ్వకూడదా" అని పిటిషనర్‌ను ప్రశ్నించింది.ఇంతకీ ఏం జరిగిందితమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం టీవీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ కరూర్‌లో పర్యటించారు. ఆ సందర్భ ంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారు. దీనితో ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన విజయ్ సర్కార్?, మరణించిన వారి బంధువులకు, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ముఖ్యమంత్రి విజయ్? 2026 జులై 10న, బంధువులు 31 మందికి స్వయంగా ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. దీనిని

# విదేశాల్లో భారతీయులపై 7 రెట్లు పెరిగిన దాడులు




**న్యూ ఢిల్లీ** విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లల్లో 7 రెట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యస భలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీ యుల పై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరింది. భారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధిక ంగా యూఎస్, యూఏఈ, యూకే, కెనడాల్లో వెలుగు చూశాయి. మొత్తం 36 దేశాల గణాంకాలను విదేశాంగ శాఖ రాజ్యసభ ముందుంచింది. అమెరికాలో గత ఐదేళ్లల్లో భారతీయులకు సంబంధించి 33 కేసు లు వెలుగు చూశాయి. యూఏఈలో 32 కేసులు, యూకేలో 31, కెనడాలో 30 కేసులు వెలుగు చూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లల్లో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి.

# అతని వద్ద 200 ఫోటోలు.. 20 ఏళ్ల జైలుశిక్ష పడే అవకాశం

**వాషింగ్టన్:** పిల్లల లైంగిక వేధింపులకు చెందిన డిజిటల్ మెటీరియల్‌ను సేకరించిన కేసులో భారతీయ సంతతి వ్యక్తి అభిషేక్ విజయ్‌కుమార్‌ను అమెరికా కోర్టు శిక్షించనున్నది. న్యూజెర్సీలోని హాస్‌బ్రౌక్ హైట్స్‌లో నివాసం ఉండే అతను తన నేరాన్ని అంగీకరించాడు. రజస్వల దశ దాటని చిన్నారులకు చెందిన ఇమేజ్‌లు, వీడియోలు కూడా కలిగి ఉన్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. 2024 మార్చిలో నిందితుడు కావాలనే ఆ మెటీరియల్‌ను సేకరించినట్లు కోర్టులో రుజువైంది. విజయ్‌కుమార్ వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ డివైస్‌ల్లో.. పిల్లల లైంగిక వేధింపులకు చెందిన కనీసం 200 ఇమేజ్‌లు ఉన్నట్లు గుర్తించారు. మూడేళ్ల చిన్నారిని లైంగికంగా వేధిస్తున్న ఓ వ్యక్తి ఇమేజ్ కూడా అతని డివైస్‌లో ఉన్నది.పిల్లలపై లైంగిక వేధింపులు ఆపేందుకు ఎఫ్‌బీఐ నిరంతరం




పోరాటం చేస్తుందని అసిస్టెంట్ అటార్నీ జనరల్ ఏ టైసెన్ దువా తెలిపారు. పిల్లల లైంగిక వేధింపులకు చెందిన ఇమే జ్‌లు కలిగి ఉన్న కేసులో నిందితుడు విజయ్‌కుమార్‌కు సుమారు 20 ఏళ్ల జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. 2027, జనవరి ఆరో తేదీన తుది తీర్పు, శిక్షను వెలువరించనున్నారు. అమెరికా శిక్షాస్మృతి మార్గదర్శకాల ప్రకారం శిక్షను ఖరారు చేయనున్నారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

## జగన్ అసెంబ్లీకి రాని మొద్దు విద్యార్థి



**విజయవాడ, ఆగస్టు 14:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ మానసిక పరిస్థితి బాగోలే దన్నారు. జగన్ ఒక తప్పిన విద్యార్థి కాబట్టే.. అసెంబ్లీకి రావడం లేదని వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి వస్తే ఏపీపీఎస్సీలో జరిగిన అక్ర మాలు అన్నిటినీ ప్రశ్నిస్తారన్న భయంతో ముఖ ం చాటేశారని అన్నారు. జగన్ అసెంబ్లీకి రాని ఒక మొద్దు విద్యార్థి అంటూ దుయ్య బట్టారు. ఈరోజు డీఎస్సీపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నా రని తెలిపారు. జెన్ జీ ఉద్యమాల పేరిట 50, 60 సంవత్సరాల వయసుగల వారితో తాము ఉద్యమాలు చేయడం లేదంటూ సెటైర్ విసిరారు. ఈనెల 16న(ఆదివారం) విజయవాడ నడిబొట్టులో ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారని ఎంపీ చెప్పారు. ఈ ర్యాలీలు చూసైనా జగన్ బుద్ధి తెచ్చుకోవాలని హితవుప లికారు. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలను డైవర్ట్ చేయడానికి డీఎస్సీలో అవకతవకలు జరిగాయంటూ.. వైసీపీ విషయా న్ని పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. జెన్ జీ అంతా నారా లోకేశ్, పవన్ కల్యాణ్ వెనకే ఉన్నారని తెలిపారు. జగన్ చేసే ర్యాలీలు చూపిస్తే పార్ల మెంట్ వేదికగా ఉన్న వారంతా ఈ వయసు వాళ్లంతా జెన్ జీ లా అని నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ ఎన్ని చెప్పినా అసెంబ్లీ ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై చర్చించి తీరుతామని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి పెంచాలి



**అమరావతి:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి వినియోగదారులకు తక్కువ ధరకే అందించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 130 రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటు సాధ్యసా ధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పవర్ జనరేషన్ ప్లాన్స్ : సచివాలయంలో విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్రంలో వేగంగా పుంజుకుంటున్న పారిశ్రామికీకరణ వల్ల ప్రతి ఆరేళ్లకు విద్యుత్ వినియోగం రెట్టింపవుతోందని దీనికి తగ్గట్టుగా పవర్ జనరేషన్ ప్లాన్స్ రూపొ ందించాలని సీఎం అధికారులకు సూచించారు. పోలవరంతో పాటు ఇతర రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఎకనమిక్ ఫీజిబిలిటీపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు పీఎం సూర్యఘర్ కింద సెప్టెంబరు నాటికి 6 లక్షల సోలార్ కనెక్షన్లు నాన్ సూర్యఘర్ కింద మరో 3 లక్షల కనెక్షన్లను వేగవంతం చేయాలన్నారు. వీటితో పాటు అదనంగా 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. కుసుమ్ పథకం లక్ష్యాలను చేరు కుంటూనే మరో 2వేల మెగావాట్ల సామర్థ్యం కోసం కేంద్రాన్ని కోరాలని సూచించారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ వంటి పునరుత్పాదక వనరులను సమన్వయం చేస్తూ రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : విద్యుత్ కొనుగోలు ధరలను తగ్గించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని సీఎం తెలిపారు. యూనిట్ విద్యుత్ కొనుగోలు ధరను ఈ ఏడాదే 4 రూపాయల 60పైసలకి తగ్గించాలని 2029 నాటికి దీన్ని 4 రూపాయలకు తీసుకురావాలని అధికారులకు గడువు విధించారు. పవర్ స్వాపింగ్, కుసుమ్, సూర్యఘర్ వంటి వివిధ మోడళ్లను సమర్థంగా ఇంటిగ్రేట్ చేయడం ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో ఆప్టిమైజేషన్ ద్వారా ఇప్పటికే రూ. 234 కోట్లు, ప్రాంప్ట్ పేమెంట్ రిబేట్ కింద రూ. 100 కోట్లు ఆదా చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇకపై విద్యుత్ సంస్థలపై ఉన్న రుణ భారాన్ని తగ్గించేందుకు ఆర్థిక సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరిపి వడ్డీ రేట్లను తగ్గించాలని ఆదేశించారు. రేటింగ్ విధానం : ఆస్తుల కల్పన, మూలధన పెట్టుబడుల కోసం మాత్రమే అప్పులు చేయాలని ఇతర రోజువారీ అవసరాల కోసం రుణాల కోసం వెళ్లే పరిస్థితి రాకూడదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని 6 విద్యుత్ సంస్థలు సమర్థంగా పని చేసేలా రేటింగ్ విధానాన్ని తీసుకురావాలని సీఎం ని . ప్రైవేట్ కార్పొరేట్ తీర్చిదిద్దాలని, ప్రతి సంస్థకు కచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించాలని ఆదేశిం చారు. సాధారణ వినియోగదారులపై విద్యుత్ టారిఫ్ భారం పెంచకుండానే పంపిణీ నష్టాల ను సంస్థలను లాభాల బాట పట్టించాలన్నారు.

## త్వరలోనే కరవు ప్రాంత ప్రజల కల సాకారం - చివరిదశకు వెలిగొండ పనులు



**మార్కాపురం జిల్లా :**దశాబ్దాలుగా సాగు, తాగు నీటి కోసం అల్లాడిన ఉమ్మడి ప్రకాశం జిల్లా కరవు ప్రాంత ప్రజల కల త్వరలోనే సాకారం కానుంది. ఆ ప్రాంతానికి సాగు, తాగు నీరిచ్చేందుకు చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం చివరి దశకు చేరింది. ఈ నెల చివరి వారంలో ట్రయల్ రన్ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అప్పటిలోగా మొదటి దశ పూర్తి చేసి నీళ్లు విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానా యుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించా రు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను విడుదల చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానా యుడు స్పష్టం చేశారు. మార్కాపురం పరిధిలోని వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్స్‌ను ఆయన అర్ధరాత్రి వేళ స్వయంగా సందర్శించారు. దాదాపు నాలుగు గంటల పాటు టన్నెల్‌లోనే ఉండి 12వ కిలోమీటర్ వద్ద చిక్కుకున్న టీబీఎం వెలికితీత పనులను, లైనింగ్ పనుల పురోగతిని అధికారులు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మరో వారంలోగా ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు."ఈ నెలలోనే జంట సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు కృ ష్ణా జలాలు విడుదల చేస్తాం. చంద్రబాబు నల్ల మల సాగర్‌లో కృష్ణా జలాలకు జలహారతి ఇస్తా రు. 3 దశాబ్దాల చిరకాల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేర్చబో తుంది. గొడ్డలి పార్టీ నా యకుడు వెలిగొండను జాతికి అంకితమ ంటూ మోసం చేశారు. నిర్వాసి తులకు అన్నిర కాలుగా అండగా ఉన్నది కూటమి ప్రభుత్వమే" - ని మ్మల రామానా యుడు, మంత్రి ముఖ్యమంత్రి నా రా చంద్రబాబు నాయుడు త్వరలోనే నల్లమల సాగర్‌లో కృష్ణా జలాలకు స్వయంగా జలహారతి ఇస్తారని నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ప్రాంతీయ ప్రజల మూడు దశాబ్దాల చిరకాల కోరికను కూటమి ప్రభుత్వం నెరవేర్చబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో 'గొడ్డలి పార్టీ' నాయకులు పనులు పూర్తి చేయకుండానే వెలిగొండను జాతికి అంకితం చేస్తున్నామంటూ ప్రజలను తీవ్రంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టు నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, వారికి పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. సొరంగంలో విరిగిపడిన కొండచరియలు: మార్కాపురం జిల్లా అర్ధవీడు మండల పరిధిలోని వెలిగొండ ప్రాజెక్ట్ కాకర్ల ఆనకట్ట దగ్గర తూర్పు ప్రధాన కాలువ సప్లై ఛానల్ సొరంగంలో కొండ చరియలు విరిగి పడటంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల వర్షాలకు సప్లయ్ ఛానల్ వెనుక భాగంలోని సొరంగం కొండపై భాగంలో సుమారు 20 మీటర్ల మేర పొడవునా 2 అడుగుల వెడల్పుతో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో పైన ఉన్న దారిలో కొండచరియల జారిపడి దారంతా మూసుకుపోయింది. ఆ వ్యర్థాలు కింద సొరంగంలోకి జారిపడి పనులు నిలిచిపోయాయి. అయితే సమీప కొండ ప్రాంతంలో ఇంకా పెద్ద మొత్తంలో కొండ పగుళ్లు ఏర్పడటంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పాదగయ క్షేత్రానికి పవన్ సతీమణి.. ఆలయంలో ప్రత్యేక పూజలు



**కాకినాడ జిల్లా, ఆగస్టు 14:** పిఠాపురం నియోజకవర్గంలోని పలు ఆలయాలను ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా సందర్శించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ సతీమణికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆపై శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానాన్నీ లెజినోవా సందర్శించారు. అలాగే కోనసీమ జిల్లాలోని ద్రాక్షారామం భీమేశ్వర స్వామి, అమ్మవార్లనూ అన్నా లెజినోవా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న పవన్ సతీమణికి రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అన్నా లెజినోవా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఇటీవల పవన్ కల్యాణ్‌కు ముంబైలోని ఆస్పత్రిలో భుజానికి సంబంధించిన శస్త్రచికిత్స విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఏపీలోని పలు ఆలయాలను పవన్ సతీమణి సందర్శించి మొక్కులు చెల్లించుకుంటున్నట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం తిరుమల శ్రీవారిని కూడా అన్నా లెజినోవా దర్శించుకున్నారు. అలిపిరి మెట్ల మార్గం గుండా కాలినడక తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్న విషయం తెలిసిందే.

## అక్టోబర్ నాటికి 70 లక్షల టన్నుల చెత్త తొలగింపు పూర్తి



**రాజమండ్రి, ఆగస్టు 14:** ఏపీలో ప్రతి రోజూ 7000 టన్నుల చెత్త వస్తోందని మంత్రి నారాయణ తెలిపారు. (శుక్రవారం) రాజమండ్రి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత చెత్త ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను వేసిందని మండిపడ్డారు. చెత్త పన్ను వేసినా లక్షల టన్నుల చెత్త వదిలేసి వెళ్లిపోయిందన్నారు. మున్సిపాలిటీల్లో మిగిలిన మొత్తం 70 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2014-19 లో 10 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని.. గత ముఖ్యమంత్రికి అవగాహన లేక వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లను రద్దు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురంలో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. పెద్దాపురంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పూర్తి కాగానే రాజమహేంద్రవరంలో వచ్చే చెత్తను అక్కడికి తరలిస్తామన్నారు. ఈలోగా వ్యర్థాల నిర్వహణ కోసం 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ప్లాంట్‌లు పూర్తి చేసి ఘన వ్యర్థాల నిర్వహణ చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సీఎం చెప్పారని, విలీన గ్రామాల అంశంపై కోర్టు తీర్పు రాగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఈనెల 28 వరకు అసెంబ్లీ సమావేశాలు! - 100 శాతం హాజరుకావాలని నిర్ణయం




**అమరావతి:** అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17న ప్రారంభమై 28 వరకు జరిగే అవకాశం ఉన్నందున కూటమి ఎమ్మెల్యేలు 100% హాజరుకావాలని ప్రభుత్వ విప్‌ల సమావేశంలో నిర్ణయించారు. అలాగే సభ ముగిసే వరకు సభ్యులు తమ సీట్లలోనే ఉంటూ అర్థవంతమైన చర్చల్లో పాల్గొనాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. అసెంబ్లీలో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతానికి సభ నాలుగు రోజులు ఉంటుందనుకున్నా, ఎన్ని రోజులు ఉంటాయో 17న శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ)లో తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. అసెంబ్లీలోని టీడీఎల్పీ కార్యాలయంలో జీవీ ఆంజనేయులు అధ్యక్షతన విప్‌ల సమావేశం జరిగింది. శాసనసభ సభ్యులుగా జీతాలు పొందుతూ అసెంబ్లీని బహిష్కరించడం ఎంతమాత్రం సమంజసం కాదని వైఎస్సార్సీపీ తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా ప్రతిపక్షానికి బుద్ధి రాలేదని, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి శవ రాజకీయాలు చేస్తున్నారని జీవీ మండిపడ్డారు. ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు చేపడుతుంటే ప్రతిపక్షాలు బురద జల్లడం తగదని ఆక్షేపించారు. డీఎస్సీపై చర్చించేందుకు సిద్ధం : డీఎస్సీ అంశంపై అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని జీవీ సవాల్ విసిరారు. శాసనసభలో గడిపే ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, ప్రస్తుతం నిర్ణయించిన 4 రోజుల సభా కాలాన్ని పెంచాలా వద్దా అనే అంశంపై ఈ నెల 17న జరగబోయే బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. స్వాతంత్ర్య దినో త్సవ వేడు కల సందర్భంగా అసెంబ్లీని విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిది ద్దామని, ఆగస్టు 14, 15 తేదీ ల్లో సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అసెంబ్లీ ప్రాంగణాన్ని సందర్శించడానికి, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించడానికి స్పీకర్ ప్రజలకు అవకాశం కల్పించారని వెల్లడించారు. "ప్రజా సమస్యలపై చర్చించేందుకైనా వైఎస్సార్సీపీ సభ్యులు అసెంబ్లీకి రావాలి. డీఎస్సీ-2025పై దుష్ప్రచారాలు మానుకోవాలి. డీఎస్సీపై అసెం బ్లీలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ ప్రజా సమస్యలు పక్కనపెట్టి శవరాజకీయాలు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్ర, శనివారాల్లో అసెంబ్లీ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. సాయంత్రం 6 నుంచి 9గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలకు సామాన్య ప్రజలు అందరూ రావచ్చు. అసెంబ్లీ లోపల చూసేందుకూ అనుమతిస్తాం." - జీవీ ఆంజనేయులు, ప్రభుత్వ చీఫ్‌విప్‌గవర్నర్ అధికారిక నోటిఫికేషన్ జారీ : మరోవైపు ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల నిర్వహణకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఇప్పటికే అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై ఉభయ సభల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ వర్షాకాల సమా వేశాలు 4 రోజుల పాటు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని పలు కీలక అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించడంతో పాటు వివిధ బిల్లులకు ఆమోదం తెలపనున్నారు.

## బస్సు ప్రయాణికులే టార్గెట్ - ఫ్యామిలీ దొంగల ముఠా అరెస్ట్



**అనంతపురం జిల్లా:**అనంతపురం జిల్లాలో బస్సు ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఓ భారీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, ఆటోల్లోకి ఎక్కి ప్రయాణికుల వస్తువులు దోచుకెళ్తున్న ముఠా ఆట కట్టించారు. ఈ దొంగతనాలకు పాల్పడుతున్న వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం విస్మయానికి గురి చేసింది. మొత్తం ఎనిమిది చోరీ కేసుల్లో సంబంధం ఉన్న ఈ ముఠాను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీశ్ వెల్లడించారు. కిక్కిరిసిన బస్సులే టార్గెట్ : ఈ ముఠా సభ్యులు పక్కా ప్లాన్‌తో చోరీలు చేస్తున్నారు. ప్రధానంగా రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులను వీరు టార్గెట్ చేసుకున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఆటోల్లోనూ ఎక్కుతారు. సాధారణ ప్రయాణికుల్లాగే వారిలో కలిసిపోతారు. తోటి ప్రయాణికులతో చాలా సానుభూతిగా మాటలు కలుపుతారు. వారి దృష్టి మళ్లించి లగేజీ బ్యాగులు, వ్యానిటీ బ్యాగుల్లో ఉన్న నగలు, నగదును క్షణాల్లో మాయం చేస్తారు. పని పూర్తికాగానే ఎవరికీ అనుమానం రాకుండా మధ్యలోనే బస్సు దిగి ఉడాయిస్తారు. మైనర్ల చేతికి పని : ఈ ఫ్యామిలీ ముఠా అకృత్యాలు పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేశాయి. దొంగతనాల కోసం కుటుం బంలోని పెద్దలు మాత్రమే కాకుండా పిల్లలను కూడా వా డ ు క ు న్నా ర ు. కుటుంబంలోని మైనర్లకు చోరీలు చేయడం ఎలాగో ముందుగానే శిక్షణ ఇచ్చారు. వారి ద్వారానే రద్దీగా ఉండే బస్సుల్లో దొంగతనాలు చేయించారు. చిన్నారులు కావడంతో తోటి ప్రయాణికులు ఎవరూ అను మానించరని వారు ఈ ఎత్తుగడ వేశారు. పోలీసుల నిఘా : గత కొద్ది రోజులుగా అనంతపురం జిల్లాలో ఈ తరహా దోపిడీలు విపరీతంగా పెరిగిపోయాయి. బాధితుల నుంచి పోలీసులకు వరుసగా ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిఘా ముమ్మరం చేశారు. పలుచోట్ల దొంగతనాలకు పాల్పడు తున్నట్లు ఆధారాలు సేకరించారు. పక్కా సమాచారంతో ఈ ముఠాను వలపన్ని పట్టుకు న్నారు. మొత్తం ఎనిమిది కేసుల్లో నిందితులుగా ఉన్న ఏడుగురు పెద్దలతో పాటు ఐదుగురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. రూ. 46 లక్షల సొత్తు స్వాధీనం : అరెస్ట్ చేసిన నిందితులను పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. వారి వద్ద నుంచి భారీగా సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మొత్తం రూ. 46 లక్షల విలువ చేసే 313.14 గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి వస్తువులను సీజ్ చేశారు. అలాగే ప్రయాణికుల నుంచి దొంగిలించిన రూ. 2.50 లక్షల నగదును కూడా రికవరీ చేశారు. ఇలాంటి ముఠాల పట్ల ప్రజలు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త వహించాలని కోరారు.

## అమరావతి పేరుతో జరుగుతున్న దోపిడీని వ్యతిరేకించాలి



**అమరావతి :** ఏపీలో అమరావతి రాజధాని పేరిట జరుగుతున్న దోపిడీని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వైసీపీకి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు రాష్ట్ర ప్రజానికానికి పిలుపు నిచ్చారు. శుక్రవారం గుంటూరులో మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణ పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా అప్పులు సైతం చేస్తున్నారని మండి పడ్డారు. అమరావతి అద్భుత నగరమంటూ ప్రచారం చేసుకుంటూ బిజినెస్ చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు అవలం భిస్తున్న విధానాల వల్ల అమరావతి ఎప్పటికీ పూర్తి కాదని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అమరావతిలో రోడ్ల నిర్మాణంలో కిలోమీటర్ రోడ్డుకు రూ.180 కోట్లు ఖర్చు చేయడం దారుణమని అన్నారు. అమరావతిలో జరుగుతున్న వ్యయాలపై ప్రజలు, మేధావులు ఆలోచించి కూటమి ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. తీసుకువచ్చి వాటిలోనూ కమీషన్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.